# ఇనుము - సుత్తి

"ప్రభాకరరావు"

"డౌన్, డౌన్"

"యాజమాన్యం దౌర్జన్యం"

"నశించాలి"

"షోకాజ్ నోటీస్"

"ఉపసంహరించుకోవాలి"

"రుచి బిస్కట్ ఫ్యాక్టరీ" కార్మిక సంఘ కార్యదర్శికి "షోకాజ్" నోటీసు ఇచ్చినందుకు కార్మికులు చేస్తున్న నిరసన ప్రదర్శన. దాదాపుగా పది సంవత్సరాలుగా మకుటంలేని మహారాజుగా వెలుగుతున్న ముకుందానికి "షోకాజ్" నోటీసు ఇవ్వడమంటే కొరివితో తల గోక్కోవడమే. రాష్ట్రస్థాయి కార్మిక నాయకుడు మరి! కేవలం హాజరైనందుకే అతనికి జీతం. అతను పని చేసే పనిలేదు. అతని పేరు ప్రొడక్షన్ డిపార్ట్‌మెంటులో ఉన్నా ఎప్పుడూ టూల్స్ ముట్టిన పాపాన పోలేదతను.

ప్రభాకరరావు ఈ మధ్యే జనరల్ మానేజర్‌గా వచ్చాడు. ఇంజనీరింగ్‌లో డిగ్రీతో పాటు మానేజ్‌మెంట్‌లో కూడా పట్టా తీసుకున్నాడతను. పరిశ్రమలో మంచి అనుభవమున్న మనిషి.

ఓ నెలపాటు ముకుందాన్ని గమనించాడతను. ఆ తర్వాత చిన్న ప్రమోషనిచ్చి స్టోర్స్‌లోకి బదిలీ చేశాడు. ముకుందం ఆటకట్టింది. బాధ్యతాయుతమైన డిపార్ట్‌మెంట్ పనిని ఇంకొకరి మీదికి తోసే వీలులేదు. ప్రమోషన్ మీద బదిలీ కాబట్టి కిమ్మనడానికి లేదు. ఒడ్డున పడ్డ చేపలా కొట్టుకున్నాడు. స్వేచ్ఛ - ప్రమోషను.

ప్రమోషను కొట్టేసి, ఆ తర్వాత స్వేచ్ఛ తిరిగి పొందాలని అనుకున్నాడు. ఏవో సాకులతో యాజమాన్యంపై వత్తిడి తేవడానికి ప్రయత్నించాడు. "వర్క్ టు రూల్" చేయించాడు. యాజమాన్యం ఖాతరు చేయలేదు. సమ్మెకు సాకు వెతుకుతున్నాడు ముకుందం. అది ఇప్పుడు దొరికేట్టుంది.

నెలాఖరి స్టాకులో యాభైవేల ముడిసరుకు తక్కువైంది. ముకుందాన్ని సంజాయిషీ అడిగింది యాజమాన్యం. అదే అదననుకున్నాడు. లంచ్ టైం నిరసనతో మొదలు పెట్టి సమ్మెదాకా సాగదీయాలనుకున్నాడు.

ప్రభాకరరావు అతనికా ఛాన్సివ్వ లేదు. ఇంకే చర్యా తీసుకోలేదు. ముకుందం సంజాయిషీ ఇవ్వలేదు. యాజమాన్యం పట్టుపట్టలేదు. కుతకుతలాడి పోయాడు ముకుందం. మరో అవకాశం కోసం వేచి ఉన్నాడు.

మళ్ళీ మెల్లగా కార్మికుల మన్ననలను సంపాదించాడు ప్రభాకరరావు. ముకుందం ప్రమేయం లేకుండా నేరుగా వచ్చే కార్మికుల కోరికలు తీరుస్తున్నాడు. యూనియన్ ద్వారా వస్తే జాప్యం చేస్తున్నాడు. కార్మికులకు చిన్న చిన్న వసతులు కల్పించి, రాయితీలిస్తూ, వారిచే బాగా పనిచేయిస్తున్నాడు. ముకుందం పట్టు క్రమంగా సడలుతోంది. అసహనంగా ఉందతనికి. తన చెంచాలను ప్రభాకరరావుపై ఉసిగొల్పాడు. చిన్న చిన్న రూల్సు ఉల్లంఘించాడు. యాజమాన్యం చూసీ చూడనట్టు ఊరుకుంది. ఇంకా మండిపోయాడు ముకుందం. ఇలా కాదని ఎలా ఐనా ప్రభాకరరావు మీద దెబ్బ తీయాలని ఓ పథకం వేశాడు. కీలకమైన కార్మికులకు సెలవు మంజూరు చేయించాడు. ఇంకొందరు కార్మికులను సిక్ రిపోర్టు చేయమన్నాడు. తను కుటుంబంతో సహా ఎక్కడికో పోయాడు.

చూస్తే యాభై శాతం కార్మికులు మాత్రం ఉన్నారు. ఆర్డర్లు చాలా ఉన్నాయి. ముడిసరుకు వచ్చింది. కాని కార్మికులు లేరు! ఎలా? ప్రభాకరరావు చెక్కు చెదరలేదు. ఉన్నవారితోనే పని కొనసాగించాడు. ఓవర్ టైం ఇచ్చాడు. ఆఫీసర్లతో ఆఫీసు సిబ్బందితో కూడా ఫ్యాక్టరీ పనులు చేయించాడు. తను కూడా రాత్రనక, పగలనక పని చేశాడు. ఉత్పత్తి కుంటుపడనీయ లేదు.

వారం రోజుల తర్వాత హాజరయ్యాడు ముకుందం.

అర్జంటుగా జబ్బు పడ్డం వల్ల పట్టణం పోయాననీ, అక్కడి నర్సింగ్ హోంలో చికిత్స పొందాననీ సెలవు చీటీతో పాటు నర్సింగ్ హోం సర్టిఫికేటు జతపర్చాడు.

పది రోజులు గడిచాయి. మళ్ళీ ముకుందానికి షోకాజ్ నోటీసు అందింది. ఈ కింది అభియోగాలకు సంజాయిషీ కోరడం ఆ నోటీసు ఉద్దేశ్యం.

1) ముందు సూచన ఇవ్వకుండా పనికి హాజరు కాకపోవడం.

2) విహారయాత్రకు పోయి జబ్బు పడ్డట్టుగా దొంగ సర్టిఫికెట్ ఇచ్చి సిక్ లీవ్ కోరడం.

3) బాధ్యత గల ఉద్యోగిగా తన విధి నిర్వర్తించక పోవడం.

తనకు సర్టిఫికెట్టు ఇచ్చిన డాక్టరు, ప్రభాకరరావు ఊరివాడనీ, విహార యాత్రకు తీసుకెళ్ళిన ట్రావెల్ ఏజంటు, ప్రభాకరరావు మేనత్త కొడుకనీ ముకుందానికి తెలియదు పాపం! ఉచ్చులో చిక్కుకు పోయాడు. రాజీ మార్గం తప్ప వేరే గతి లేదని తెలుసుకున్నాడు. ఒక్క ఇంక్రిమెంటు తగ్గింపుతో ఉద్యోగం దక్కించుకున్నాడు.

ఇప్పుడు ప్రభాకరరావు మనిషి యూనియన్ సెక్రెటరీ!

ఇనుమును వేడెక్కించి సుత్తి మాత్రం చల్లగా ఉండి తన పని కానిచ్చింది. ★